

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
5
గురువారం 13 మార్చి 2025



టీటీడీ ఆధ్వర్యంలో రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో శనివారం జరుగనున్న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ కల్యాణానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్న దృష్ట్యా ఏర్పాట్లను బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీశ్‌కుమార్ పరిశీలించారు.



వేంకటేశ్వరుని కల్యాణం చూతము రారండి...



వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో వేస్తున్న భారీ గుడి సెట్టింగ్స్

8

మామూళ్ల... కిక్



మత్తులో పల్లెలు..

బాపట్ల జిల్లాలో 700, ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేలకు పైగా బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తుంది. పల్నాడు జిల్లా పరిధిలోని ఓ ప్రజా ప్రతినిధి గ్రామంలో ఆరు మద్యం బెల్ట్ షాపులు ఉన్నాయి. అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే మంచినీటి సరఫరా లేని ప్రాంతాల్లో కూడా మద్యం అందుబాటులో ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

రోడ్లపైనే మద్యపానం.. ఎక్కడంటే అక్కడ బెల్ట్ దుకాణాలు.. కావాల్సిన మద్యం ఎనిటైం డోర్ డెలవరీ.. యథేచ్ఛగా ఎమ్మార్పీ ఉల్లంఘనలు.. వేళలు పాటించని దుకాణదారులు.. శృతి మించిపోతోన్న మందు బాబుల ఆగడాలు.. అయినా అటు పోలీసు.. ఇటు ఎక్సైజ్ అధికారులకు పట్టడంలేదు. ప్రజలు మద్యం ఇబ్బందులపై ఫిర్యాదులు చేస్తున్నా ఆయా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. మద్యం దుకాణదారుల నుంచి వసూలు చేసే మామూళ్లే ఇందుకు కారణమని తెలుస్తోంది. మామూళ్లు దండుకోవడంలో బిజీబిజీగా ఉన్న ఎక్సైజ్, పోలీసు శాఖలు మద్యం అక్రమాలపై దృష్టి సారించడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండని అధికారులు అభయం ఇస్తుండటంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మద్యం వ్యాపారులు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కేస్తున్నారు. ఆయా శాఖలు దుకాణానికి నగదు ఫిక్స్ చేసి మరీ నెలవారీగా వసూలు చేస్తున్నారు. మద్యం వ్యాపారులు మామూళ్లు ఇవ్వడం సర్వసాధారణమైనా ప్రస్తుతం ఆ మొత్తాన్ని అమాంతం పెంచేశారు. దీంతో ఆ భారాన్ని వ్యాపారులు మద్యం విక్రయాలు, ఎమ్మార్పీ పెంచి అమ్ముకోవడంతో సరిపెట్టుకుంటున్నారు. ఈ కారణంగానే మూడు జిల్లాల్లో మద్యం అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తెలుస్తోంది.

- అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండి
- వ్యాపారులను పిండేసేలా అధికారుల దందా
- పల్నాడు జిల్లాలో దుకాణానికి రూ.50 వేలు ఫిక్స్
- బాపట్ల జిల్లాలో రూ.25 వేలుగా నిర్ణయించి వసూలు
- గుంటూరులో రూ.20 వేలు వసూలు చేస్తున్న పోలీసులు
- చెప్పినంత ఇవ్వకుంటే కేసులు.. దాడులని బెదిరింపులు
- మామూళ్ల వసూళ్లలో ఎక్సైజ్, పోలీసు శాఖలు బిజీబిజీ
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మద్యం అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీసు శాఖలది. అయితే జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి లేదు. ఒకవిధంగా చూస్తే మద్యం వ్యాపారుల అక్రమాలకు అధికారులే అండగా ఉన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే జిల్లా కేంద్రం, మారుమూల పల్లె అన్న తేడా లేకుండా మద్యం విక్రయాలు.. మందు బాబుల ఆగడాలు శృతి మించుతున్నాయి. మద్యం వ్యాపారులను పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు పిండేస్తున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు ఇప్పటికే తడిసిమోపెడైన ఫీజులతో వ్యాపారులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లోనూ వసూళ్ల దందాతో అధికారులు వ్యాపారులను పిండేస్తున్నారు. అడిగినంత చెల్లిస్తే మీరు ఏం చేసుకున్నా పట్టించుకోం.. లేకపోతే కేసులు పెడతామని పోలీసులు, దాడులు చేస్తామని ఎక్సైజ్ అధికారులు వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అధికారులకు నెలవారీగా మామూళ్లు సమర్పించుకుంటున్నారు. మామూళ్ల మత్తులో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తూగుతుండగా వ్యాపారులు యథేచ్ఛగా బెల్ట్ షాపులను నిర్వహించుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 337 మద్యం దుకాణాలు, 159 బార్లు ఉండగా వసూళ్ల మొత్తం నెలకు సుమారు కోటి రూపాయలపైనే ఉన్నట్లు తెలుస్తోంది. నెలకు రూ.20 వేలు చెల్లించాల్సిందేనని పట్టుబడుతూ అలా చెల్లించని వారిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఇబ్బంది పెడుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. అమాంతం పెంచగా వచ్చిన నగదులో కొంత మొత్తాన్ని కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు పంచుకుంటున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లా పరిధిలోని వ్యాపారుల నుంచి ఎక్సైజ్ శాఖలో ఉన్న మూడు విభాగాలతోపాటు పోలీస్ శాఖ కూడా మామూలు వసూలు చేస్తున్నట్లు (మిగతా 8వ పేజీలో)

- గుంటూరు ప్రతి మద్యం దుకాణం నుంచి నెలకు రూ.20 వేలుగా మామూళ్లను పోలీసు శాఖ ఫిక్స్ చేసినట్లు సమాచారం. గతంలో ప్రతి షాపు నుంచి నెలకు రూ.10 వేలను అందజేసే వారు. అయితే తాజాగా కొంత మంది పోలీసు అధికారులు ఈ మామూళ్ల మొత్తాన్ని అమాంతం పెంచేశారు. నెలకు రూ.20 వేలు చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు.
- పల్నాడు జిల్లాలో మద్యం షాపుల మామూళ్ల దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది ఒక్కొక్క షాపు నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు ఎక్సైజ్, పోలీస్ శాఖలు నెలవారీగా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో మద్యం దుకాణదారులకు నెల వారీగా ఎక్సైజ్‌శాఖ మామూళ్లను ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఒక్కో దుకాణం నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బెల్ట్ దుకాణాల నుంచి కూడా ప్రత్యేకంగా నగదు సూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన మొత్తం నెలకు దాదాపు రూ.30 లక్షల వరకు ఉన్నట్లు మద్యం షాపుల యజమానులే చెబుతున్నారు.

బరితెగింపు

గ్రామాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే బెల్టుతీస్తాం.. ఎమ్మార్పీ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.. మద్యం విషయంలో నేతల జోక్యాన్ని సహించేది లేదు.. అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరికలు చేసినా క్షేత్రస్థాయిలో ఎక్కడా వాటిని పట్టించుకున్న నాయకులు కానీ, అధికారులు కానీ లేరు. పైగా దాదాపు ప్రతి గ్రామంలో ఒకటికి మించి బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం ఒక ఎత్తయితే, లైసెన్సు మద్యం షాపుల యజమానలే నేరుగా మద్యాన్ని గ్రామాల్లో డెలివరీ చేయడం బరితెగింపునకు నిదర్శనంగా కనబడుతోంది.

వసూలు.. 37.06 శాతమే

- 19 రోజుల్లో రూ.399.71 కోట్లు సాధ్యమేనా?
- మున్సిపాలిటీల్లో మందకొడిగా పన్నుల వసూళ్లు
- మొండి బకాయి దారుల కుళాయిల తొలగింపు
- ఆస్తుల జప్తునకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు



మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా

మునిసిపాలిటీ	వసూలు లక్ష్యం (కోట్లలో)	పన్ను వసూలు (కోట్లలో)	వసూలు శాతం (కోట్లలో)
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	20.59	8.68	42.14
చిలకలూరిపేట	22.40	6.54	29.21
వినుకొండ	6.30	4.86	77.17
సత్తెనపల్లి	8.75	3.97	45.35
మాచర్ల	7.63	3.19	41.84
పిడుగురాళ్ళ	6.97	4.09	58.59
దాచేపల్లి	2.49	1.38	55.51
గురజాల	1.90	1.04	54.82
గుంటూరు జిల్లా :			
గుంటూరు	320.52	104.18	32.50
తెనాలి	30.07	15.45	51.37
మంగళగిరి, తాడేపల్లి	48.98	32.21	65.76
పొన్నూరు	7.40	4.31	58.24
బాపట్ల జిల్లా :			
రేపల్లె	6.57	3.78	57.51
బాపట్ల	12.90	5.41	41.91
చీరాల	13.69	7.43	54.31
అద్దంకి	5.12	3.67	71.80

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సంవత్సరం గడువు సమీపిస్తోంది. లక్ష్యం భారీగా ఉంది. అయినా మున్సిపాల్టీల్లో పన్నుల వసూలు మందకొడిగా సాగుతోంది. ఈ నెల 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి ఇంకా రూ.399.71 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికి 37.06 శాతమే వసూలైంది. గడువు 19 రోజులు మాత్రమే ఉన్నా ఆస్తి.. నీటి పన్నుల వసూల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. మున్సిపాల్టీల్లో లక్ష్యాల మేర పన్నుల వసూలు జరగడం లేదు. గుంటూరు కార్పొరేషన్ సహా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో రూ.635.16 కోట్ల పన్నుకు ఇప్పటి వరకు రూ.235.45 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ.522.23 కోట్లుకు రూ.210.13 కోట్లు, నీటి పన్ను రూ.112.93 కోట్లకు రూ.25.32 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఆస్తి పన్ను వసూలు 40.23, నీటి పన్ను 22.42 శాతాలుగా నమోదయ్యాయి. మొండి బకాయిదారుల కుళాయి కనెక్షన్లను గత కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. అయినా వారిలో చలనం అంతగా ఉండటంలేదు. ఆస్తుల జప్తునకు నోటీసులను జారీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మొండిబకాయిదారుల్లో మార్పు వచ్చి పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తారని అధికారులు ఎదురుచూస్తున్నారు. గడువు సమీపిస్తున్న తరుణంలో పన్నులు చెల్లించేందుకు ఇళ్ల యజమానులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు పని చేసేలా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. మొండి బకాయిలతో పాటు ప్రభుత్వ సంస్థల పన్ను రూ.కోట్లలో పేరుకుపోయి ఉంది. పన్నుల వసూళ్లపై పర్యవేక్షణ కొరవడటంతో అధికారులు, సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని మున్సిపాల్టీలు చతికిల పడుతున్నాయి. మార్చి నెలాఖరు కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఖాళీ స్థలాలు, ప్రకటనల పన్ను వసూళ్లలో కూడా జాప్యం జరుగుతున్నది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన ప న్ను పక్కదారి పడుతున్నది. రాజకీయ పైర వీలతో ఈ పన్ను చెల్లించడం లేదు.

- పల్నాడు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.10.38 కోట్లు బకాయి ఉంది. ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.5.05 కోట్లు బకాయి ఉంది. సత్తెనపల్లిలో ఎఫ్‌సీఐకి సంబంధించి రూ.5.20 కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల మున్సిపాల్టీలు పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. చిలకలూరి పేటలో 29.21 శాతం లోపే వసూలైంది. వినుకొండ మున్సిపాల్టీ 77.17 శాతం పన్ను వసూలుతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.
- గుంటూరు జిల్లాలో ఆస్తి పన్ను 4.6.97 కోట్లు, నీటి పన్ను రూ.85.65 కోట్లు వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ.144.52 కోట్లు, నీటి పన్ను రూ.17.84 కోట్లు వసూలు చేశారు. గుంటూరు కార్పొరేషన్, తెనాలి మున్సిపాల్టీలో పన్నుల వసూలు దారుణంగా ఉంది. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

లీకేజీ వీరుడే.. రింగ్‌లీడర్

- ఆయన కనుసన్నల్లోనే బీఈడీ కోర్సు
- ఏఎన్‌యూలో సెమినార్లకు ఆర్థిక చేయూత
- మూల్యాంకనం నుంచి పరీక్షా కేంద్రాలు ఆయన అనుమతితోనే..

గుంటూరు(విద్య), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆయన శాసిస్తాడు.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ)లో అధికారులు పాటిస్తారు. బీఈడీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో తాజాగా అరెస్టు అయిన వ్యక్తి వర్సిటీలోని బీఈడీ కళాశాలలో జరిగే అక్రమాలకు, అందుకు సహకరిస్తున్న యాజమాన్యాలకు రింగ్‌మాస్టర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. లీకేజీ నిందితుడైన ఇతడి కనుసన్నల్లోనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీఈడీ కోర్సు నడుస్తుందంటే ఆశ్చర్యం కాదు. బీఈడీ మూల్యాంకనం విధానాలు.. పరీక్షా కేంద్రాల అనుమతి.. ఇలా అన్ని విషయాల్లో ఆయన ఆదేశాలు జారీ చేస్తాడని వాటిని వర్సిటీలోని కొందరు అమలు చేస్తారన్న ఆరోపణలున్నాయి. వర్సిటీలో బీఈడీ కోర్సుకు సంబంధించిన సెమినార్లు ఆయన ఇచ్చే మామూళ్లతోనే నిర్వహిస్తారన్న విమర్శలు కూడా ఉన్నాయి. వర్సిటీ ఉపాధ్యాయ విద్య సమావేశాలలో ఉన్నతాధికారులతో కలిసి ఆయన దర్శనమిస్తూ ఉంటాడు. పరీక్షా భవన్‌లోని కొందరి అధికారులతో ఉన్న అత్యంత సాన్నిహిత్యాన్ని ఆసరా చేసుకుని ఏఎన్‌యూలో బీఈడీ కోర్సును శాసిస్తున్నాడు. ఈ లీకేజీ వీరుడు గతంలో పాఠశాల విద్య ఆర్జేడీతో కలిసి బీఈడీ కళాశాల నుంచి లంచాలు తీసుకుంటూ హైదరాబాదులో ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. వైసీపీ హయాంలో పేపర్ల లీకేజీ కేసులో పోలీసుల చేతికి చిక్కాడు. ఇతడు బీఈడీ కళాశాల అనుమతుల పేరిట కళాశాలల వారీగా డబ్బులు దండుకున్నాడని ఆరోపణలు ఉన్నాయి. పేపర్ల లీకేజీ జరిగిన సమయంలో వర్సిటీలో జరిగిన సెమినార్‌కు ఇతను నుంచే ఆర్థిక సహాయం అందినట్లు సమాచారం. వర్సిటీలో ఇటీవల ఓ సెమినార్ వివాదాస్పదంగా మారింది. వర్సిటీ కేటాయించిన 1,25,000 నగదు కాకుండా భారీగా వసూలు చేశారు. ఆ డబ్బులు ఇచ్చిన వారినే ముఖ్య అతిథులుగా ఆహ్వానించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి అధికారులకు, లీకేజీ కేసులో అరెస్ట్ అయిన వ్యక్తి నరసరావుపేట, తెనాలి, వినుకొండ కళాశాలల నుంచి డబ్బులు ఇప్పించినట్లు చర్చ జరుగుతోంది. పల్నాడు జిల్లాలో జరిగిన రికార్డుల మూల్యాంకనం లో ఒక్కో కళాశాల నుంచి రూ.6000 చొప్పున వర్సిటీ ఆదేశాల ప్రకారం వసూలు చేశారు. మార్కులు మార్పిడి లేకుండా ఒక అధికారితో కుమ్మక్కై మూల్యాంకనాన్ని పక్కదారి పట్టించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. లీకేజీ రింగ్‌మాస్టర్‌కు చెందిన బీఈడీ కళాశాలలో థియరీ పరీక్షలలో పరస్పర మార్పిడి ద్వారా సెంటర్లు నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం సిబ్బంది లేకపోయినా, తరగతులు నిర్వహించకపోయినా మూల్యాంకనానికి వర్సిటీ నియమించిన ఎగ్జామినర్లను తిరస్కరించినా అధికారితో ఉన్న స్నేహం వల్ల ఆ లీకేజీ రింగ్‌మాస్టర్ విషయంలో వర్సిటీ అధికారులు విన్నకుండి పోయారు. పరీక్ష భవన్‌లో ఒక అధికారితో ఉన్న అనుబంధంతో ఉపాధ్యాయ విద్యలో లీకేజీ స్టార్లు రింగ్ మాస్టర్లు తయారవుతున్నారు.



- ఏటా రూ.కోట్లలో నష్టపోతున్న రైతులు
- ఆగని బిల్-టూ-బిల్, మచ్చు, దొడ్డికాపలా దొంగతనాలు
- ఎన్ని ప్రభుత్వాలు, అధికారులు మారినా అరికట్టలేని దుస్థితి

యార్డులో దోపిడీ

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ఎదిరించి.. తెగుళ్లను అధిగమించి.. ఆరుగాలం రెక్క ల కష్టంతో రైతులు మిర్చి సాగు చేస్తుండగా.. యార్డుకు వచ్చిన వారు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు మారినా... అధికారులు ఎంతమంది వచ్చినా గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను దోపిడీ చేసే విధానాలకు అడ్డుకట్ట పడటంలేదు. యార్డులో వేళ్లూనుకొనిపోయి ఉన్న విధానాలను రూపుమాపడం ఎవరి తరం కావడం లేదు. బిల్-టూ-బిల్, మచ్చుకాయలు తీసుకోవడం, దొడ్డి కాపలాదారులు టిక్కీలను కోసి కాయలను దొంగలించడం వంటి విధానాలు యథాతథంగానే కొనసాగుతున్నాయి. గతంలో చైర్మన్‌లుగా విధులు నిర్వహించిన మన్నవ సుబ్బారావు, నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు హ యాంలో కొన్ని రోజుల పాటు మచ్చు కా యలు తీయనీయకుండా, యార్డులోకి ఇతరులు ప్రవేశించకుండా అడ్డుకున్నారు. దొంగతనంగా తీసుకొచ్చిన మిరపకాయలను యార్డు వెలుపల కొనుగోలు చేస్తున్న దుకాణాలను కూడా మూసేయించారు. దాంతో కొంతమంది నేతలు హమాలీలను ఎగదోసి యార్డులో ధర్నాలు, ఆందోళనలు, ఆఫీసులపై దాడులు చేయించారు.

- యార్డులో ఆర్థిక స్తోమత తక్కువగా ఉన్న వ్యాపారుల వద్దకు వచ్చే బడా వ్యాపారులు పరం పేరుతో బిల్ చేస్తున్నారు. రైతు వద్ద అధికారికంగా 2 శాతం, అనధికారికంగా మరో 2 నుంచి 3 శాతం కమీషన్ వసూలు చేసి ఇద్దరు పంచుకుంటున్నారు. ఈ బిల్-టూ-బిల్ వ్యాపారం నిత్యం జరుగుతూనే ఉంటుంది.
- రైతులు తీసుకొచ్చిన మిర్చిని ఎగు మతిదారులకు చూపించేందుకు టిక్కీలు కోసి ప్లాట్‌ఫాంపై హమాలీలు కుప్ప పోస్తారు. కొనుగోళ్ల తర్వాత ఒక్కో లాట్ నుంచి కేజీలకు కేజీల మచ్చుకాయలు తీసుకుంటున్నారు. మచ్చుకాయలు తీసిన తర్వాతనే కాటాలు జరుగుతాయి. దీంతో ఇటు కమీషన్ వ్యాపారి, అటుఎగుమతి దారుడికి ఎలాంటి నష్టం ఉండదు. రైతే నష్టపోతున్నాడు.
- రైతులు తీసుకొచ్చిన మిర్చి విక్రయం జరగకపోతే మరుసటి రోజు కోసం దొడ్డి కాపలాదారులకు కాపలాగా పెట్టుకోవాలి. ఇందుకు టిక్కీకి నిర్ణయించిన కాపలా ఫీజుని వారికి రైతులు చెల్లించాలి. దొడ్డికాపలాదారులు రాత్రివేళ టిక్కీలు కోసి దొంగతనంగా కాయలు బయటకు తరలిస్తున్నారు.

ముగిసిన జాతీయ స్థాయి ఎడ్లపోటీలు

- సీనియర్స్ విభాగంలో నంద్యాల జతకు ప్రథమ స్థానం

6

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి





మృతి చెందిన తేజ్‌కుమార్, వెంకటగోపి

నరసరావుపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన ఇద్దరి యువకులు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన నరసరావుపేట మండలం పెట్లూరు వారి పాలెం వద్ద చిలకలూరి పేట మేజర్ కాల్వలో బుధవారం చోటుచేసుకుంది. చెన్నైపాలెం తేజ్ కుమార్(19), బొరుగొర్ల వెంకటగోపి(22) అనే యువకులు మృతి చెందా రు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన ఏఎంరెడ్డి కళాశాలలో తేజ్‌కుమార్ పాలిటెక్నిక్ చదువు తున్నాడు. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం వీరయ్యపాలెం గ్రామానికి చెందిన వెంకటగోపి స్థానిక ఎన్ఈసీ ఇంజ నీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుకుంటున్నాడు. స్నేహితులైన వీరిద్దరూ కోటప్ప కొండ రోడ్డులోని ఓ హాస్టల్ ఉంటున్నారు. స్నేహితులైన మరో ఇద్దరితో కలిసి వీరు చిలకలూరిపేట మేజర్ కాల్వలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో తేజ్ కుమార్, వెంకటగోపి లోతుగా ఉన్న కాల్వ దిగారు. ఎంతసేపటికీ పైకి రాక పోవడంతో స్నేహితులు సమీపంలోని రైతులకు సమాచారం ఇచ్చారు. వారం తా కలిసి కాల్వలో గాలించినా ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదే హాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నరసరావు పేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 521.60 అడుగులు ఉంది. ఇది 152.21 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7684 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,787 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 9259 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల పందాలు

సీనియర్స్ విభాగంలో నంద్యాల జతకు ప్రథమస్థానం

రాజుపాలెం,మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 96వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల పందాలు ముగిశాయి. బుధవారం నిర్వహించిన సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా పెదకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా ఉజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డిలకు చెందిన కంబైన్స్ ఎడ్లజత 25 నిమిషాల నిర్ణీత కాలవ్యవధిలో 2842.11అడుగుల దూరంలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా సిరివెల్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంగోపాల్ రెడ్డికి చెందిన ఎడ్లజత 2334.10అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలువగా తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన గాయం సృజనారెడ్డి శ్రీధర్‌రెడ్డి,



సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి కటికం లక్ష్మణ్ కుమార్‌కు చెందిన కంబైన్స్ ఎడ్లజత 2212 అడుగుల దూరంలాగి మూడవస్థానంలో, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 2118.9అడుగుల దూరంలాగి నాల్గో స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషాచౌదరి శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 2000 అడుగుల దూరంలాగి ఐదవస్థానంలో, ప్రకాశం జిల్లా రాసర్ల మండలం పుల్లలచెరువుకు చెందిన బొర్రా రవితేజకు చెందిన ఎడ్లజత 1276 అడుగుల దూరంలాగి ఆరవస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారంకు చెందిన లక్కుసాయి సాత్విక్ ఎడ్లజత 1187అడుగుల దూరంలాగి ఏడవస్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండలం కొప్పొలు గ్రామానికి చెందిన ఐతరాజు సత్యానారాయణ ఎడ్లజత 754.6అడుగుల దూరంలాగి ఎనిదవ స్థానంలో నిలిచాయి.

సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనంతో తీర్చిదిద్దాలి

● ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నగరానికి అతి పెద్ద ప్రధాన రహదారి అయిన సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చదనానికి, ప్రకృతి వైభవానికి అనవాలుగా తీర్చిదిద్దాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధి అధికారులను



రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డుపై పచ్చదనాన్ని పరిశీలిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారధి

ఆదేశించారు. బుధవారం ఆమె సీడ్ యాక్సెస్ రోడ్డుపై జరుగుతున్న రోజువారీ నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవిలోకి అడుగుపెట్టిన తరుణంలో మొక్కలకు అధిక ఉష్ణోగ్రతలను గ్రహించే శక్తిగా బలాన్ని చేకూర్చాలని సూచించారు. అతి సుందరమైన ఈ రహదారిపై మొక్కల మధ్య ఖాళీలు ఉన్న చోట సూర్యరశ్మిని తట్టుకునే శక్తివంతమైన పూల మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సీడ్ యాక్సెస్ సెంట్రల్ మీడియన్ మీద డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి మొక్కలకు సమృద్ధిగా నీరందించాలని జైన్ ఇరిగేషన్ ప్రతినిధి జితేంద్రకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్‌జోన్ అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఏడీసీ నిర్మాణం చేపడుతున్న రహదారులపై ఎక్కడా నీటి నిల్వలకు తావు లేకుండా జాగ్రత్తలను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించా రు. ఈ పర్యటనలో ఏడీసీ జనరల్ మేనేజర్ కే శ్రీహరిరావు, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి ధర్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారికి 9కిలోల బంగారుపూత ఆభరణాలు

● మొక్కు తీర్చుకున్న రాజధాని రైతు

తుళ్లూరు(వెంకటపాలెం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామం వెంకటపాలెం వేంకటేశ్వర స్వామికి 9కిలోల బంగారు పూత కలిగిన వెండి ఆభరణాలను నేలపాడు రైతు ధనేకుల రామారావు బుధవారం బహూకరించారు. స్వామి చతురహస్తాలకు, శంఖు చక్రాలకు తొడుగు ఆభరణాలు 11.5లక్షలతో చేయించి టీటీడీ అధికారులకు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని నిలిపివేసి రోడ్డు పాలు చేయటంతో ఉద్య మం చేపట్టారు. అందులో నేలపాడుకు చెందిన ధనేకుల రామారావు రైతు సమన్వయ కమిటీ సభ్యులుగా ఉన్నారు. రాజధాని అమరావతిని భగవంతుడు రైతులకు తోడుండి కాపాడాలని వెంకటపాలెం శ్రీవారి ని అప్పుడు మొక్కుకున్నారు. భగవంతుడి దయతో కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం సంతరించుకోవటంతో మొక్కు తీర్చుకున్నానని రామారావు చెప్పారు. కార్యక్రమంలో వెంకటపాలెం రైతు జేఏసీ నాయకులు లంకా సుధాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) డిప్యూటీ ఈవో శివప్రసాద్, సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌లు రామకృష్ణ, సాయి గణేష్ పాల్గొన్నారు.



టీటీడీ అధికారులకు శ్రీవారి ఆభరణాలు అందజేస్తున్న నేలపాడు రైతు ధనేకుల రామారావు

వైసీపీ పాలనలో అడుగుకో కీచకుడు : చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో ఒకడే కీచకుడు ఉంటే వైసీపీ పాలనలో మాత్రం రాష్ట్రంలో అడుగుకో కీచకుడు మహిళలను వేధించాడని, వారిపై నేరాల్లో రాష్ట్రాన్ని తలవంచుకునే పరిస్థితుల్లో నిలబెట్టారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో ధ్వజమెత్తారు. ఎక్కడ మహిళలు గౌరవం అందుకుంటారో అక్కడ దేవతలు కొలువుతీరుతారని చంద్రబాబు నమ్మితే ఆ మాటలకు అర్థం లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. శాసనసభలో మహిళాసాధికారతపై చర్చ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బుధవారం మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలకు చేసిన అన్యాయంపై నిప్పులు చెరిగారు. మొదటి నుంచి మహిళా పక్షపాతిగా ఉన్న చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో వారి దశ మార్చితే జగన్ వారిని రోడ్లపాలు చేశారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళలకు రూ.18వేల కోట్లు పసుపుకుంకుమ కింద ఇస్తే జగన్ కల్తీ మద్యంతో 30వేల మంది అక్కాచెల్లెమ్మల తాళిబొట్లు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా చేసి పట్టపగలు కూడా ఆడవారు రోడ్లపై తిరగలేని పరిస్థితి తెచ్చారన్నారు. వైసీపీ పాలనలో 250మంది ఎస్సీ మహిళలు, ఎస్టీ ఆడబిడ్డలు 2 వేల 27 హత్యలకు గురయ్యారన్నారు. మహిళలపై 2,04,414నేరాలు జరిగాయని, ఒక్కమాటలో చెప్పాలంటే గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రంలో పరిస్థితి తాలిబన్ల పాలన కంటే ఘోరంగా తయారు చేశారని అన్నారు. సుమారు 4,034 అత్యాచారాలు జరిగాయని, 22,272మంది మహిళలు అదృశ్యమయ్యారని, అయినా వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు.



అసెంబ్లీ మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ఆగిన ఇళ్లకు అదనపు సాయం

◆ ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు.. ఎస్టీలకు రూ. 75వేలు

◆ గుంటూరు జిల్లాలో 14,112 మందికి చేకూరనున్న లబ్ధి



గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేదల గూడుపై కూటమి ప్రభుత్వం పెద్ద మనసు చూపింది. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహాయంతో ఇళ్లు నిర్మించుకుందామని ఆశపడి ఇళ్లు కట్టుకోలేక మధ్యలోనే ఆపేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో జగనన్న కాలనీల పేరుతో మొదలై అర్ధాంతరంగా ఆగిపోయిన పేదల ఇళ్లు సహా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించుకుంటున్న ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 14,112 మంది పేదల ఇళ్ల నిర్మాణానికి మోక్షం కలగనుంది. ఎస్సీ, బీసీల ఇళ్లకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తోంది. దీంతో ఎన్టీఆర్ నగర్లుగా రూపాంతరం చెందిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి మోక్షం లభించినట్లయింది.

● 14,12 మందికి లబ్ధి: కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లలో 14,112 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 6,530 మంది ఎస్సీలకు రూ. 50వేలు, 1,213 మంది ఎస్టీలకు రూ. 75వేలు, 6,369 మంది బీసీలకు రూ. 50 వేల చొప్పున ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. అయితే లబ్దిదారుల ఇళ్లు 2024 డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉంటేనే ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,40,254 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,39,436 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,40,254 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,733 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11000	12400
334	9500	13800	బ్యాడిగి 355	10000	13800
నంబరు. 5	10000	14000	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14500	దేవనూరు డీలక్స్	11500	13500
4884	--	--	ఆర్మూరు	10000	11200
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	7500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10500	14000			

నేడు పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),మార్చి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా,గుంటూరు,ప్రకాశం జిల్లాల పరిధిలోని భవిష్యనిధి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు నేడు పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ ప్రాంతీయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పెన్షన్ అదాలత్‌కు ఫిర్యాదులు పంపాలని ఈ సందర్భంగా సూచించారు. ఫిర్యాదులు ro.guntur@epfindia.gov.inఅనే మెయిల్‌కు, లేదా 9494657469అనే వాట్సప్ నెంబర్‌కు,26409929697 వెబ్‌ఎక్స్ ఐడీకి, పాస్కోడ్ epfo@1234కు పంపాలని సూచించారు.

పల్నాడు వార్తలు



సమావేశంలో పాఠశాలల జాయింట్ డైరెక్టర్ ఎన్ గీత తదితరులు

స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించిన పాఠశాలల జేడీ

పిడుగురాళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తీరును బుధవారం పాఠశాలల జాయింట్ డైరెక్టర్, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల రాష్ట్ర పరిశీలకురాలు ఎన్ గీత పరిశీలించారు. సమావేశాల పనితీరును, ఉపయోగాల గురించి, నేర్చుకోవాల్సిన కొత్త విషయాల వంటి అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులలో నైపుణ్యం పెంచేందుకు ఈ సమావేశాలు ఉపయోగపడతాయని గీత తెలిపారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, పీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాగునీటి సమస్య లేకుండా చూస్తున్నాం..



మేజర్ కాల్వలకు నీటి పంపిణీని పరిశీలిస్తున్న ఏఈ రామకృష్ణారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు

ముప్పాళ్ళ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో పంటలను సాగుచేస్తున్న రైతులకు సాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ రామకృష్ణారావు తెలిపారు. బుధవారం సాగునీటి సరఫరాలో అడ్డంకులను తొలగించే పనులను ఆయన పరిశీలించారు. మండలంలోని ములకలూరు మేజర్ రైతులు తమ పొలాలకు నీరు రావడంలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు మండల పరిధిలోని అన్ని మేజర్లకు సాగునీటి సరఫరాలో ఆటంకాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఆరుతడి పంటలకు నీటికొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, ఎన్‌ఎంఆర్ లస్కర్‌లు ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్

మాచవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచి నీటిఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధంచేసి ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షత జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏఈ సురేష్ మాట్లాడారు. మండలంలో చెన్నాయపాలెం, వేమవరం, పిన్నెల్లి గ్రామాల్లో వేసవికాలంలో మంచినీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నందున అన్ని గ్రామాలకు సుమారు రూ.15లక్షల వ్యయం కాగల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు. ఎంపీడీవో వెంగళరావు మాట్లాడుతూ పీ-4 సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, తడి, పొడిచెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు వారివారి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర రూ.7,550కు కందులు కొనుగోలు చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు చిట్టిప్రోలు గురవయ్య, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంఈవో శ్రీధర్, వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్, ఏవో రామమ్మ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోయలకు అధిక ప్రాధాన్యం

● రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన

పిడుగురాళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడుకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి బోయలకు ప్రాధాన్యత ఇచ్చినట్లయిందని రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో ఆయన సమావేశమయ్యారు. బోయ కులస్తులకు ఎస్టీ రిజర్వేషన్ విషయంలో టీడీపీ సానుకూలంగానే వుందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి బీసీలను ఎలా మోసం చేశాడో అందరికీ తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా బోయ సామాజిక వర్గానికి చెందిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

మాచర్లటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు పట్టణ పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలో సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యారాణి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రివేళల్లో వెనుకగా వచ్చే వాహనాలకు ముందున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్లో వాహనాలను నిలిపి వెనుకభాగంలో రేడియంస్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటుపై అధికారులు సమావేశం

మాచర్ల రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో అధికారులు బుధవారం రాత్రి గ్రామస్థులతో సమావేశమయ్యారు. పంచాయతీ ఏర్పాటుతోపాటు అభివృద్ధి, స్థానిక ఎన్నికల నిర్వహణ, విద్యుత్, ఇంటి స్థలాల వంటి అంశాలను చర్చించారు. స్థానికులు తమ అభిప్రాయాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఏఈ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లుపూర్తి

బెల్లంకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలకు బెల్లంకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటుచేశామని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవో రాజ కుమారి తెలిపారు. మొత్తం 260మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంఈవో పేర్కొన్నారు.

అంగన్‌వాడీలను రోడ్డున పడేసిన ఘనత జగన్‌దే

పెదకూరపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను రోడ్డున పడేసిన ఘనత మాజీ సీఎం జగన్‌రెడ్డికి దక్కుతుందని అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల రాష్ట్ర కార్యదర్శి జి.లీలావతి అన్నారు. లింగంగుంట్లలో బుధవారం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు తెలుగు మహిళా నేతలు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని కార్యకర్తలందరూ ఐక్యతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో చింతలపూడి అశోక్‌కుమార్, కేవీ, చల్లా పిచ్చిరెడ్డి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, చింతా రామారావు, వీరభద్రుని రామిరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

● నకరికల్లు: నకరికల్లులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావదినం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేటలోని ఆంజనేయ విగ్రహం సెంటర్‌లో బుధవారం వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య ఆధ్వర్యంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఎస్‌కే జానీ తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: పట్టణంలోని జీబీసీ కాలనీలో వైసీపీ పట్టణ కార్యదర్శి కర్రా గిరిబాబు ఆధ్వర్యాన పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైసీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి కర్రా చిన కోటేశ్వరరావు, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామా.. కనవేమిరా..?

● రాములోరి భూముల ఆక్రమణ
● చోద్యం చూస్తున్న అధికారులు



రాములవారి రామాలయం, ముఖ ద్వారం

దాచేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల క్రితం తాత ముత్తాతలు సీతారామస్వామివారి నిత్య దూప, దీప, నైవేద్యానికి, శ్రీరామనవమి వేడుకల నిర్వహణకు ఇచ్చిన భూమిని నేడు కొంతమంది వ్యక్తులు తప్పుడు రికార్డులు సృష్టించి ఆ భూములు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని అడగాల్సిన అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. స్వామివారి పంటభూములకు రెవెన్యూ రికార్డులు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు అమ్ముకున్నారు. దీంతో స్వామివారి పూజా కార్యక్రమాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పుడు రికార్డులు సృష్టించి భూములు కాజేసిన వ్యక్తులపై అధికారులు దృష్టి సారించకపోవటంపై పలు విమర్శలకు తావిస్తోంది. దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో సర్వే నెంబరు 129లో సీతారామస్వామివారికి 7.62 ఎకరాల భూమి ఉంది. ఈ భూములను రైతుల పేరుతో రికార్డులు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేయించుకొని సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములు అమ్మారు. పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్వామివారి భూములలో భవనాలు నిర్మించి తమ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ విషయంపై రెవెన్యూ, దేవదాయ, పంచాయతీరాజ్ అధికారులు నోరు విప్పకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు పంటపొలాలకు సాగునీరు అందించే నీటి పారుదలశాఖకు చెందిన పంటకాలువను కూడా పూడ్చివేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే నిర్మాణాలు చేపట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సాగునీటి అధికారులు మాత్రం ఇంతవరకు ఈ విషయంపై ప్రశ్నించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం కొద్దిరోజుల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఈ భూముల విషయమై నోటీసులు పంపించారు. స్వామివారి భూములు, పంటపొలాలు కబ్జాలకు గురవుతున్నా గత పాలకుల అండదండలతోనే ఈ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగు, సాగునీటికి భారీగా నిధులు

● జలజీవన్ మిషన్ ద్వారా రూ.600 కోట్లు
● వరికపూడిశెలకు రూ.15 కోట్లు
● 100 పడకలుగా మాచర్ల ప్రభుత్వాసుపత్రి

మాచర్లటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం జలజీవన్ మిషన్ ద్వారా మాచర్ల నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి రూ.600కోట్లు కేటాయించడం హర్షణీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. 8 నెలల్లోనే ఇంటింటికి రక్షిత తాగునీరు అందించేదిశగా అడుగులు పడుతున్నాయంటే దానివెనుక నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం జలజీవన్ మిషన్ ద్వారా రూ.1200కోట్లు కేటాయింపు జరిగితే అందులో 50శాతం నిధులు రూ.600కోట్లు మొదటి ఫేజ్‌లో మాచర్లకి కేటాయింపు జరిగిందన్నారు. పల్నాటి ప్రజల దశాబ్దాల కల వరికపూడిశెల నిర్మాణానికి తొలి అడుగులు పడ్డాయన్నారు. అటవీశాఖకు రూ.15కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ మొదటి ఫేజ్ నిర్మాణం రూ.500కోట్లు కాగా బడ్జెట్‌లో మొదటిస్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపనతో సరిపెట్టిన జగన్‌రెడ్డి రిషికొండ ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చు వరికపూడిశెలకు కేటాయిస్తే ఈ ప్రాజెక్ట్ ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. మొదటి ఫేజ్ పూర్తైతే వెల్దుర్తి మండలం మొత్తానికి తాగు, సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధిచేయాలన్న డిమాండ్లు ఎప్పటినుంచో ఉందన్నారు. చంద్రబాబు దార్శనికతతో నేడు మాచర్ల ప్రభుత్వాస్పత్రికి మహర్దశ పట్టనుందన్నారు. ఈ ఆసుపత్రిలో న్యూరాలజీ, కార్డియాలజీ స్పెషాలిటీలతో కూడిన వైద్యం అందనుందని చెప్పారు. ఆసుపత్రి 100 పడకలుగా అప్‌గ్రేడ్ అవుతుందన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం

● మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలకసంఘంలో వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్‌కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యాపారులతో బుధవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను అమ్మరాదన్నారు. వంద మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను విక్రయించకూడదన్నారు. వ్యాపారులు పురపాలకసంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వివిధ రకాల హోల్‌సేల్ వ్యాపారులందరితో ఆయన సమావేశం నిర్వహించారు. వ్యాపారుల సూచనలు ఆయన స్వీకరించారు.

● పట్టణంలోని 2, 21 వార్డుల్లో మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ విజయ కుమార్‌లు పర్యటించి కాలువలను శుభ్రం చేయించారు. కాలువల్లోని వ్యర్థాలను శానిటరీ సిబ్బంది చేత తొలగింపజేశారు. మురుగుకాలువల్లో వ్యర్థాలు పడవేయరాదని ఆయా వార్డుల్లోని ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

● పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్



ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం 10:39 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విగ్రహప్రతిష్ఠకు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత యజ్ఞశాల వద్ద ఆయన వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహనిర్మాణ ప్రధాన దాత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. పూజా కార్యక్రమాల్లో నియోజకవర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు, గంధం కోటేశ్వరరావు, ఏపూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, కొమ్మినేని సతీష్, మన్నెం శ్రీనివాసరావు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కర్నాటి కృష్ణారావు, కామేశ్వరరావు, గురునాథం, బాలకృష్ణ, రామాంజనేయులు, అంజిరెడ్డి, వెంకటేశ్వరశర్మ, కొండలరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



మాదిపాడు కృష్ణానది వద్ద బ్రిడ్జి నిర్మించబోయే పరిసరాల్లోని పొలాల రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

బ్రిడ్జి నిర్మాణపనుల రికార్డులు పరిశీలన

అచ్చంపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై నిర్మించబోయే బ్రిడ్జి పనుల అనుమతులు, భూములను ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సమీపంలో ఉన్న ప్రభుత్వభూములను కూడా పరిశీలించినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పులిచింతల సమీపంలోని ప్రభుత్వ భూములను కూడా ఆర్డీవో పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనుల అనుమతుల రికార్డులను మరొకసారి తనిఖీ చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 30.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. 2వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

రాజుపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వలన భూమి సారవంతంగా ఉండి అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని ఆకులగణపవరంలో రైతుసేవా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయశాఖ, అనుబంధ శాఖ, ప్రకృతి వ్యవసాయశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పంటలను సాగుచేస్తున్న నర్రా మల్లికార్జునరావును సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నర్రా బాబురావు, ఏవో వెంకటనరసయ్య, ఏపీఎం శివకుమార్ ఉన్నారు.

జగన్ పేరు తొలగించిన హద్దురాళ్ల పరిశీలన

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ప్రాంగణంలో నిల్వచేసిన రిసర్వే హద్దురాళ్లపై ఉన్న జగన్ పేరును తొలగిస్తున్నారు. పేరు తొలగించిన రాళ్లను బుధవారం తహసీల్దార్ డానియేలు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్‌ఓ పరిశీలించారు. నూతనంగా రిసర్వే జరిగిన గ్రామాల్లో ఈ రాళ్లను వినియోగిస్తామని ఆయన తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలి

పెదకూరపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అర్హతగల ప్రతి ఒక్కరికి ఇళ్ళస్థలాలను మంజూరుచేయాలని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధానకార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ కోరారు. బుధవారం తహసీల్దార్ ధనలక్ష్మికి సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబకలహాల నేపథ్యంలో గొడ్డళ్ళతో దాడి

● ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

సత్తెనపల్లి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో జరిగిన దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రెంటపాళ్ళలో బుధవారం జరిగింది. రూరల్ పోలీసులు, బాధితుల కథనం మేరకు.. మండలంలోని దీపాలదిన్నెపాలెం గ్రామానికి చెందిన పిల్లకతువుల గంగయ్యకు అచ్చంపేట మండలం కొండూరుకు చెందిన శివగంగతో ఏడునెలల క్రితం వివాహమైంది. అప్పటినుంచి గంగయ్య భార్యను తరుచూ కొడుతూ ఉండేవాడు. భార్యాభర్తలు, గంగయ్య కుటుంబసభ్యులు నెలనుంచి రెంటపాళ్ళ సమీపంలోని పొలాల్లో గొర్రెలు మేపుతూ ఉన్నారు. ఈ క్రమంలో శివగంగను భర్త గంగయ్య తీవ్రంగా గాయపరిచాడు. విషయం తెలుసుకున్న శివగంగ, తండ్రి బత్తుల గంగయ్య, అన్న వీరరాజులు రెంటపాళ్ళ వచ్చి ఇలా చేయటం ఏంటని? గంగయ్యను ప్రశ్నించారు. దీంతో గంగయ్య, అతని తల్లి నరసమ్మ, సోదరుడు అంజి, బావ వెంకటేశ్వర్లు గొడ్డళ్ళతో బత్తుల గంగయ్య, వీరరాజు, శివగంగలపై దాడిచేయగా ముగ్గురికి తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన బత్తుల గంగయ్య, శివగంగలను గుంటూరు తరలించారు. గంగయ్య పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ

● రాళ్లు రువ్వుకున్న రెండు సామాజిక వర్గాలు
● చెదరగొట్టిన పోలీసులు



పర్యవేక్షిస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ రెండు సామాజికవర్గాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం మాచర్లలోని పాతవడ్డెరపాలెంలో ఈ ఘర్షణ జరిగింది. మంగళవారం వడ్డెర సామాజికవర్గానికి చెందిన యువకుడు మద్యం తాగి ఎస్సీ సామాజికవర్గం వీధిగుండా వెళ్తుండగా ఘర్షణ జరిగింది. అది కాస్తా బుధవారం రాత్రికి రెండు సామాజికవర్గాల మధ్య పోరుగా మారింది. ఇరువర్గాల యువకులు ఒకరిపై ఒకరు పోట్లాడుకుంటుండగా ఘర్షణ తీవ్రస్థాయికి చేరి రాళ్లవర్షానికి దారితీసింది. చాలామందికి దెబ్బలు తగిలినా బయటకువచ్చే పరిస్థితి లేదు. గురజాల డీఎస్పీ జగదీష్, పట్టణ సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యారాణి, నరసింహ, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్‌షఫి ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఏప్పుడుఏంజరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

● పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి మధు



సత్తెనపల్లి ఆర్టీసీ డిపోను తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి మధు

సత్తెనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలందిస్తామని పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి మధు తెలిపారు. బుధవారం సత్తెనపల్లి ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోలను తనిఖీచేసి ఆర్టీసీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు చేపడతామన్నారు. ముందుగా ఆయన స్థానిక ఆర్టీసీ డీఎం విజయకుమార్‌తో డిపోకు సంబంధించి పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం డిపోలోని గ్యారేజ్ కార్మికులతో ఆయన మాట్లాడారు. గ్యారేజ్ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం బస్టాండ్‌లోని ప్రయాణికుల విశ్రాంతి గదిని పరిశీలించారు. బస్టాండ్‌లో పెచ్చులూడిన పైభాగం గుర్తించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. మొదటిసారిగా ఆర్టీసీ డిపోకు వచ్చిన మధుకు ఎన్‌ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

ఆస్తిపన్ను మొండి బకాయిలపై చర్యలు తీసుకోండి

● పురపాలక సంఘ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

మాచర్లటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని యాజమాన్యాలపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారని 29వ వార్డు కౌన్సిలర్ సుభాని ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని పురపాలకసంఘ సాధారణ సమావేశం చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిలర్ సుభాని సమావేశంలో పలు అంశాలను లేవనెత్తారు. పట్టణంలో ఆవుల సంచారం ఎక్కువగా వుందని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించగా చైర్మన్ స్పందిస్తూ ఆవులను రోడ్లపై తిరగకుండా కట్టడి చేశామని, 90 శాతం ఆవుల యజమానులను పిలిపించి అపరాధ రుసుం వసూలుచేసి అప్పగించామని చెప్పారు. పట్టణంలోని శివారు కాలనీలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని సుభాని కోరగా, సమస్యను పరిష్కరిస్తామని చైర్మన్ సమాధానమిచ్చారు. ప్రజా మరుగుదొడ్లు, మెప్మా కార్యాలయంలో మహిళల కోసం టాయిలెట్స్ ఏర్పాటుచేయాలని ఒకటో వార్డు కౌన్సిలర్ గట్ల అరుణకుమారి కోరారు. నెహ్రూనగర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వస్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని సూచించారు. అజెండాలో పొందుపరిచిన 42 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, డీఈ సుభాని, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఆర్ఐ వెంగయ్య, మెప్మా సీవో రాజశేఖర్, సీడీపీవో సరళ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలు మొగ్గు చూపాలి

మాచవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపి తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందవచ్చని పల్నాడు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయా రజిని సూచించారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయశాఖ, వెలుగుసిబ్బంది వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రైతు పొందూరి నరసింహారావును సన్మానించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి రామమ్మ, మండల సీసీ నాగరాజు, ఏపీఎం సీతారామయ్య, మండల సమాఖ్య ఓబీ మంగమ్మ, సైదయ్య, సౌజన్య పాల్గొన్నారు.

సరస్వతి భూముల్లో మట్టి అక్రమ తవ్వకాల పరిశీలన

మాచవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను దాచేపల్లి మైనింగ్, మాచవరం రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. గత కొన్ని రోజులుగా సరస్వతి భూముల్లో రాత్రి సమయాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి గురజాల ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. అక్రమ తవ్వకాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ దాచేపల్లి మైనింగ్, మాచవరం రెవెన్యూ అధికారులను గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు దాచేపల్లి మైనింగ్ ఆర్ఐ శివలీల, సర్వేయర్ దయానా, మాచవరం రెవెన్యూ ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మన్ రాజులు అక్రమ తవ్వకాల ప్రదేశాలను పరిశీలించారు.

రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

నకరికల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సంక్షేమ పథకాలు పొందాలంటే భూమి ఉన్న ప్రతి రైతు రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్యను పొందాలని ఏవో కే దేవదాసు కోరారు. గురువారం నరసింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ జాన్ అహమ్మద్, జీ మౌలాలి, రైతులు పాల్గొన్నారు.

పీ - 4 సాధికార సర్వే వేగవంతంగా చేయాలి

నకరికల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఈ ఏడాది ఉగాది నుంచి పీ-4 విధానం అమల్లోకి రానున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. మార్చి 8వ తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభమైందని, సచివాలయ ఉద్యోగులు వేగవంతంగా సర్వేను నిర్వహించాలన్నారు. నకరికల్లులో బుధవారం సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ప్రసాదు, ప్రత్యూష, ప్రసాదు, రషీదా బేగం పాల్గొన్నారు.

ముప్పాళ్ళ మండలంలో...

ముప్పాళ్ళ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో జరుగుతున్న సర్వేని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేలో ఖచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. ఆయనవెంట డీటీ లక్ష్మీప్రసాద్ ఉన్నారు.

గోళ్ళపాడులో చోరీ - 5 సవర్ల బంగారం అపహరణ

ముప్పాళ్ళ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ళపాడులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారు నాగలక్ష్మి నరసరావుపేటలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటోంది. గోళ్ళపాడులోని ఆమె ఇంటి తలుపులు తెలిచివున్నాయని గ్రామస్తులు నాగలక్ష్మికి తెలిపారు. దీంతో నాగలక్ష్మి బుధవారం వచ్చిచూడగా ఇంటితాళం పగులగొట్టి 5 సవర్ల బంగారం, రెండుజతల వెండిపట్టీలు, రూ.5వేల నగదు పోయాయని గుర్తించి ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సోమేశ్వరరావు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

ప్రతి ఒక్కరు ఉన్నతస్థానాలను అధిరోహించాలి

పెదకూరపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎన్ఆర్ఐ ఉత్తర అమెరికా తెలుగు సంఘం నేషనల్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ బాలినేని అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌లో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి చదువుతున్న 64మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, హెచ్‌ఎం కాకాని వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న ఉచిత గుండె వైద్య శిబిరం


దుర్గి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో ఈ నెల 15వ తేదీన విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సహకారంతో సర్పంచ్ డి.చెన్నయ్య ఆధ్వర్యాన ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నారు. బీపీ, ఈసీజీ, గుండె స్కానింగ్ పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేయనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవానలి సర్పంచ్ చెన్నయ్య కోరారు.

● 15న రాజధానిలో శ్రీనివాస కల్యాణం
● వెంకటపాలెం ఆలయం ఎదుట భారీ సెట్టింగ్స్



క్రేన్‌తో తరలిస్తున్న ఆలయ సెట్టింగ్ మెటీరియల్

● ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు
● కల్యాణోత్సవానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు



స్వామి వారి కల్యాణ వేదికను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

వేంకటేశ్వరుని.. కల్యాణం చూతము రారండి

తుళ్లూరు,(వెంకటపాలెం) మార్చి 12(ఆంధ్రజ్యోతి) : రాజధాని గ్రామంలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం కల్యాణోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ నెల 15న శ్రీనివాసుని కల్యాణానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్ర 6.30 గంటల నుండి 8.30గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. దానికిగాను ఆలయం ముందు ఆవరణలో భారీ గుడి సెట్టింగ్స్ వేస్తున్నారు. ఈ ఉత్సవానికి సీఎం చంద్రబాబు హాజరవుతారని అధికారులు తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ అధికారులు, స్థానిక మండల అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు : ఈవో

శ్రీనివాస కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఈవో శ్యామలరావు సూచించారు. బుధవారం ఆయన వెంకటపాలెంలోని దేవాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు సులభతరంగా స్వామి వారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి వాహనాలను క్రమ పద్దతిలో పార్కింగ్ చేసేలా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సూచనలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి వారి కల్యాణాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ ఏర్పాట్లను పర్యవేశించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీర బ్రహ్మం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాహనాల పార్కింగ్‌కు ఆలయం తూర్పు భాగంలో సిద్ధం చేసిన స్థలం



భక్తులు కూర్చునేందుకు సిద్ధం చేసిన ప్రాంగణం

◆ గేదె, ఆవుకు రూ. 30 వేల వరకు బీమా
◆ తెల్లకార్డుదారులు 20 శాతం చెల్లిస్తే చాలు

పశువులకు బీమా...పాడిరైతుకు ధీమా

గుంటూరు సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది.పాడి పశువులతో బాటు, గొర్రెలు మేకలకు కూడా పశు బీమా పథకాన్ని అమలు పరిచేందుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ బీమా ద్వారా మూడు సంవత్సరాలకు ఒకేసారి ప్రీమియం చెల్లిస్తే రైతుకు ఏ నష్టం వాటిల్లినా పరిహారం అందే ఏర్పాటు చేశారు.నూతన బీమా పథకంలో గేదె,ఆవు విలువ రూ.30 వేలు ఉంటే, మూడు సంవత్సరములకు రూ. 1920 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు ప్రీమియం సొమ్ములో 20 శాతం అనగా రూ.384 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ. 1568ని ప్రభుత్వమే పశు యజమానుల తరపున చెల్లించటం జరుగుతుంది. తెల్లరేషన్ కార్డు లేని వాళ్ళు ప్రీమియం సొమ్ములో రూ.960 చెల్లించాలి. మిగిలిన రూ.960 సొమ్మును ప్రభుత్వం చెల్లించటం జరుగుతుంది. గొర్రెలు మేకలకు సంబంధించి గరిష్ఠంగా గొర్రె, మేకకు రూ.6 వేలకు ప్రీమియం మొత్తం రూ.180 చెల్లించాల్సి ఉంది. తెల్లరేషన్ కార్డు దారులు కేవలం రూ. 36 చెల్లిస్తే సరిపోతుంది. తెల్లకార్డు లేని వాళ్ళు రూ.90 చెల్లించాల్సి ఉంటుంది. పశు బీమా పథకం ద్వారా పశువు ప్రమాదము వలన గాని, వ్యాధుల వలన గాని, ప్రకృతి వైపరీత్యాల వలన గాని మరణించినచో ఈ బీమా వర్తిస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. మండలాలలో ఉన్న పశు వైద్యశాలలు, గ్రామీణ పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి పశుబీమా చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అగ్నివీర్‌లో నియామకాలకు 13 జిల్లాలకు నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేవోఐఎన్‌ఐఎన్‌డీఐఎన్‌ఏఆర్‌ఎంవై.ఎన్‌ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ కేటిగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరుగుతుందన్నారు. అలానే 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని 6 నిమిషాల 15 సెకన్లకు పెంచడం జరిగిందన్నారు. అన్ని కేటిగిరీలకు ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కల్ప, పొన్న, శేష వాహనాలపై నృసింహుడు

మంగళగిరి సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి నృసింహుడు బుధవారం వివిధ వాహనాలపై భక్తులను అలరించారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి ఊరేగిన శ్రీవారు.. రాత్రి పొన్న వాహనసేవలో పాల్గొన్నారు. ఓ వైపు పొన్న వాహన సేవ కొనసాగుతుండగానే శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీనృసింహస్వామి వార్ల ఉత్సవమూర్తులను కొత్త పెండ్లికుమార్తెలు, పెండ్లి కుమారుడిగా అలంకరింపజేసి శేష వాహనంపై గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ ఆకురాతి కోదండరామయ్య అన్నమాచార్య కీర్తలను ఆలపించారు.



కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు


నేడు కల్యాణం... రేపు రథోత్సవం

● హాజరుకానున్న మంత్రి లోకేశ్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ గురువారం రాత్రి స్వామి వార్ల కల్యాణం జరుగనుంది. శుక్రవారం ఉదయం నృసింహ స్వామి వారు అశ్వ వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొంటారు. కల్యాణం అనంతరం శుక్ర వారం మధ్యాహ్నం దివ్య రథోత్సవం జరుగనుంది. అశేష జనవాహిని నడుమ జరిగే ఈ రథోత్సవాన్నే మంగళగిరి తిరునాళ్లగా వ్యవహరిస్తారు. 13వ తేదీ రాత్రి జరిగే కల్యాణ మహోత్సవానికి, 14న జరిగే స్వామివార్ల దివ్య రథోత్సవంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సతీసమేతంగా హాజరవుతారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు.

దివ్యాంగులకు ఇంధనం





● జిల్లాలో 2 వేల మందికి లబ్ధి
● దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు
● 50శాతం రాయితీ కల్పిస్తున్న ప్రభుత్వం

గుంటూరు (తూర్పు), మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు అందించింది. శారీరక వైకల్యం ఉండి స్వయం ఉపాధి పొందుతున్న వారికి, ప్రైవేటు ఉద్యోగులకు రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించనుంది. దీనికి సంబంధించిన గుంటూరు బృందావన్‌గార్డెన్స్, వయో వృద్ధులు, హిజ్రాల, దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధన భారం లేకుంగా 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రాయితీపై ఇంధనం అందించే పథకాన్ని రూపొందించి అమలు చేసింది. అ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిధులను పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపించాయి. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ పథకాన్ని పట్టాలెక్కించింది.

● అర్హులు ఎవరంటే....

స్వయం ఉపాధి పొందుతున్న వారు. ప్రైవేటు ఉద్యోగులు చేసుకుంటూ మూడు చక్రాల మోటారు కల్గిన వాహనాలు వినియోగించే దివ్యాంగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వాహనానికి వినియోగించే డీజిల్, పెట్రోల్ ఖర్చులో 50శాతం రాయితీ ఇస్తారు. లబ్ధిదారులు ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్లే దూరానికి మాత్రమే ఈ రాయితీ వర్తింపజేస్తారు. 2 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15లీటర్లు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కల్గిన వాహనాలకు 25 లీటర్లు వరకు రాయితీ ఉంటుంది. ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులకు వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారులక ఖాతాలకు జమ చేస్తారు.

● కావాల్సిన పత్రాలు

దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం (తొలి పేజీ), ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ఏదైన సంస్థలో పనిచేస్తున్నట్టు ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

● జిల్లాలో రెండు వేల మందికి పైగా లబ్ధి

ఇంధన రాయితీ పథకంతో జిల్లాలో రెండు వేల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుంది. గతంలో ప్రభుత్వం అందించిన వెయ్యి మూడు చక్రాల వాహనాలతో పాటు, మరి కొంత మంది రుణాల ద్వారా మరో వెయ్యి వాహనాలను కొనుగొలు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంతో ప్రతి లబ్ధిదారునికి ఏడాదికి దాదాపు రూ 25వేలు వరకు లబ్ధి చేకూరుతుంది.

● సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందజేస్తున్న ఇంధన రాయితీని దివ్యాంగులు సద్వియోగం చేసుకోవాలి. పథకానికి సంబంధించిన నిధులును ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకానికి దివ్యాంగులు ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తరువాత ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులను కార్యాలయంలో సమర్పించాలి. అ తరువాత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం.

-సువార్త, ఏడీ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ

● ఆర్థిక భారం తగ్గుతుంది

ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంతో దివ్యాంగులకు ఆర్థిక భారం కొంత మేర తగ్గుతుంది. స్వయం ఉపాధిని కొనసాగించడానికి, వారికి జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు శక్తి నిస్తుంది. ప్రభుత్వం స్పందించి అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పునరుద్ధరించడం అభినందనీయం. దీంతో పాటు గతంలో మూడు చక్రాల వాహనాలు ఇవ్వాలంటూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించాలి.

వెలుగు శివప్రసాదు, విభిన్న ప్రతిభా వంతుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు

వసూలు.. 37.06 శాతమే

(5వ పేజీ తరువాయి)

కార్యాలయాలకు సంబంధించి 7.10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి రూపాయి కూడా వసూలు కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.35.64 కోట్లు ఉంది.

- బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు లక్ష్యం కాగా రూ.20.29 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 6.63 కోట్లకు రూ.1.94 కోట్లు వసూలైంది. బాపట్ల మినహా మిగిలిన మున్సిపాల్టీలు 53 శాతానికి పైగా వసూలు చేశాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయి రూ.3.55 కోట్లు ఉంది. 71.80 శాతం పన్ను వసూలుతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో అద్దంకి మున్సిపాల్టీ నిలిచింది.

మామూళ్ల.. కిక్

(5వ పేజీ తరువాయి)


ఆరోపణలున్నాయి. బాపట్ల జిల్లాలో అధికారికంగా 119 మద్యం షాపులు ఉండగా అనధికారికంగా 700 వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులతో పాటు మద్యం షాపుల యజమానులకు నెల వారీ మామూళ్లను ఎక్సైజ్‌శాఖ ఫిక్స్ చేసినట్లు సమాచారం. నెలకు దాదాపు రూ.30 లక్షల వరకు ముడుపుల రూపంలో ఎక్సైజ్‌శాఖకు ముడుతున్నట్లు మద్యం షాపుల యజమానులే చెబుతున్నారు. బాపట్ల జిల్లాలో ఓ నియోజకవర్గ పరిధిలో ఓ నేత ఏకంగా ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపే వారి జాబితాను ఎక్సైజ్‌శాఖకు పంపి ఆ షాపుల వైపు కన్నెత్తి చూడొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇక ద్వితీయశ్రేణి నేతాగణం కూడా ఈ దందాలో అన్నీ తామై వ్యవహరిస్తున్నారని సమాచారం.

యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన

అధికారులు అడిగినంత మామూళ్లు ఇస్తున్నాం కదా అని మద్యం దుకాణదారులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి మున్సిపల్ కేంద్రాలు, పల్లెల్లో అక్కడా ఇక్కడ అన్న తేడా లేకుండా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కొన్ని దగ్గర్ల ఆరుబయటే, ప్రధాన రహదారులపైనే మందుబాబులు మద్యం తాగుతూ అల్లర్లు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. మందుబాబులు ఆగడాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు ఆలకించడంలేదు. గ్రామాల్లో వీధివీధినా బెల్టు షాపులు నిర్వహించుకుంటున్నా పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక పలు ప్రాంతాల్లో మద్యం షాపులు వేళలు కూడా పాటించడం లేదు ఎనీ టైం అన్న తరహాలో కొన్నిచోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం షాపులకు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వకపోయినా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. దీంతో రెస్టారెంట్ తరహాలో మద్యం షాపులు నడుస్తున్నాయి. సమయాన్ని బట్టి ఎమ్మార్పీకి అదనంగా వసూలు చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. నెలవారీ మామూళ్లు ఫిక్స్ చేసి వసూళ్లు చేసుకునే పనిలో ఎక్సైజ్ శాఖ బిజీగా ఉంటే, అధికార పార్టీ నేతల అండతో ద్వితీయశ్రేణి నాయకులు బెల్ట్ షాపుల నిర్వహించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా దుకాణాల్లో ఎమ్మార్పీ ధరకంటే అదనంగా రూ.30 నుంచి 40 వరకు వసూలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూస్తున్న పాపాన పోవడం లేదు.

ప్రపంచ భవిష్యత్తు భూమి, మొక్కల చేతుల్లోనే..

గుంటూరు సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ భవిష్యత్తు ఆరోగ్య కరమైన భూమి, మొక్కల చేతుల్లోనే ఉందని అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి అన్నారు. లాంఫామ్ లోని ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఆయన ముఖాముఖిగా చర్చించారు. ప్రొఫెసర్ ఎం ఎస్ రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ విధానాలు, పరిశోధనలపై వివరించారు. ఈ కార్యాలయంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారదా జయలక్ష్మి, పరిశోధనా సంచాలకులు డాక్టర్ వీవీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఎం ఎస్ రెడ్డి

మందడంలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

తుళ్లూరు, (మందడం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. మందడం టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని పలకరించింది. యూనిట్ ఆఫీసును సందర్శించింది. బృంద సభ్యులు రైతులతో ముచ్చటించారు. రాజధాని గ్రామాల్లో ప్రజల ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, భూములిచ్చిన రైతుల స్థితిగతులు, గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు తదితర అంశాలను తెలుసుకోవడానికి ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించినట్టు సీఆర్డీఏ అధికారులు చెప్పారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బృంద సభ్యుల కు పేదల టిడ్కో ఇంటి నివాసాలు.. వర్షపు నీరు నిర్వహణ, వాగుల అభివృద్ధి, ప్లాట్ల రిజిస్ట్రేషన్, అమరావతిలో జరిగిన అభివృద్ధి, జరగబోతున్న అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణాలు, రైతుల ప్లాట్లలో అభివృద్ధి గురించి మందడం యూనిట్ కార్యాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై వివరించారు.



మందడం సీఆర్డీఏ కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు బృందం



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రశాంతంగా దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలు

నరసరావుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ఐదోరోజు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయని డీఈవో ఎల్.చంద్రకళ వెల్లడించారు. గణిత శాస్త్రం, చరిత్ర పరీక్షలకు మొత్తం 1053మంది అభ్యర్థులకు గాను 958మంది, 91శాతం హాజరయ్యారన్నారు. ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. స్టేట్ అబ్జర్వర్, జాయింట్ డైరెక్టర్ ఎన్.గీత గురజాలలోని గుడ్‌న్యూస్ హైస్కూల్ కేంద్రంలో తనిఖీ చేశారు. నరసరావుపేటలోని మూడు పరీక్షా కేంద్రాలను డీఈవో, ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఐదు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

210 కిలో మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటున్నా: అబ్దుల్లా

వినుకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29వతేదీన జరిగే ఎస్‌ఈబీ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగే 24 గంటల్లో, 210 కిలోమీటర్ల ఏఎఫ్ఐ పరుగు పందెంలో పాల్గొనేందుకు వెళుతున్నట్లు పట్టణానికి చెందిన అబ్దుల్లా బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 24వ తేదీన జరిగిన 42 కిలోమీటర్ల మారథాన్ పోటీల్లో అవార్డు సాధించి మరో అవార్డు కోసం ముందుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

14న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ

నరసరావుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి పౌర్ణమి సందర్భంగా 14వ తేదీన గిరి ప్రదక్షిణ జరుగుతుందని కోటప్పకొండ గిరి ప్రదక్షిణ సేవాసమితి సభ్యుడు అనుమోలు వెంకయ్యచౌదరి బుధవారం తెలిపారు. ఉదయం ఐదు గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం అవుతుందన్నారు.

ఉపాధ్యాయులకు సమావేశం

రొంపిచర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, రెడ్డిపాలెం గ్రామాల్లోని జడ్పీ పాఠశాలలు, ఏపీ మోడల్ పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం జరిగాయి. తరగతుల వారీగా మార్చి నెలలో పూర్తి చేయాల్సిన సిలబస్, విద్యా బోధన, పాఠశాలలో వసతులపై వివరించారు. కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుభానీ, శ్రీనివాసరావు, రవినాయక్ మాట్లాడారు. ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ఆయా సమావేశాలను పర్యవేక్షించారు.

హైటెన్షన్ వైర్ల కింద పంట వ్యర్థాలను తగలబెట్ట వద్దు

● పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం రమేష్‌రెడ్డి

వినుకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతంలోని హైటెన్షన్ వైర్ల కింద రైతులు ఎండిపోయిన చెత్త, పత్తి, కంది, మిరప, మినుము వంటి పంటలకు నిప్పు పెట్టరాదని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సంస్థ డీజీఎం రమేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ సమీపంలోని శివారు ప్రాంతాల్లో 4లక్షలు, 5లక్షలు, 7.65 లక్షల ఓల్టేజీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు (పెద్ద టవర్స్) కింద నిప్పు పెట్టడం వల్ల మంటలు లైన్ తీగలకు తాకితే పొగ, మంటల ద్వారా కరెంటు భూమికి వచ్చి చుట్టుపక్కల విద్యుదాఘాతానికి గురవచ్చన్నారు. అదేవిధంగా విద్యుత్ వైర్ల కింద ఏపుగా పెరిగే జామాయిల్, సుబాబుల్, కొబ్బరి, టేకు, ఎర్రచందనం చెట్లతో పాటు లైన్‌ల కింద గృహాలు, షెడ్‌లు, ఎత్తైన కట్టడాలు నిర్మిస్తే విద్యుత్ ప్రసరించి ఆస్తి నష్టం సంభవిస్తుందన్నారు. రైతులు, గృహ యజమానులు విద్యుత్ వైర్ల కింద మంటలు, చెట్లు, పెద్ద పెద్ద కట్టడాలను చేపట్టరాదన్నారు.

రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ సమీక్ష

వినుకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ సురేష్‌నాయక్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు అందించాల్సిన సేవలపై చర్చించారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన పీ 4 సర్వే, వర్క్‌ఫ్రమ్ హోం సర్వే, ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు రెవెన్యూ సేవలు, రెవెన్యూ అంశాలపై చర్చించి పలు సూచలను అందించారు.

సాగర్ జలాలతో సింగర చెరువు కళకళ

● వేసవిని దృష్టిలో పెట్టుకొని చెరువును నింపిన అధికారులు

వినుకొండ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని వినుకొండ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎట్టకేలకు అధికారులు ఎన్ఎస్‌పీ కాలువ నుంచి సింగరచెరువును నీటితో నింపారు. సుమారు 4 నెలల వరకు నీరు ఇబ్బంది లేకుండా వాటర్ లెవల్‌ను 2.38 మీటర్ల వరకు నీటితో నింపడంతో చెరువులో నీరు తొణికిసలాడుతోంది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యథాతథంగా రోజు మార్చి రోజు ప్రజలకు నీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేస్తామని మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు.



2.38 మీటర్ల మేరకు సాగర్ జలాలతో కళకళలాడుతున్న సింగరచెరువు

టిడ్కో ఇళ్లు పూర్తిచేయాలి

పురపాలక శాఖ మంత్రి నారాయణకు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వినతి

వినుకొండ టౌన్ మార్చి 12, (ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లాలో జగన్ ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన తాగునీటి పథకంతో పాటు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా జీవీ ఆంజనేయులు శాసనసభలో మునిసిపల్ వ్యవహారాలపై జీవీ ఆంజనేయులు బుధవారం మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వినుకొండతో పాటు, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల సహా అనేక పట్టణాల్లో తాగునీటి పథకం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, వేగంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ శాఖ మంత్రిని కోరారు. నాడు కేంద్ర మంతిగా ఉన్న వెంకయ్యనాయుడు సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు అమృత్ పథకాన్ని తీసుకు వచ్చారని, ఆ పథకం కింద రూ.8వేల500 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వం వాటా కింద 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 40శాతం చెల్లించాల్సి ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించక పోవడంతో పథకం పనులు ఆగి పోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో నైనా వాటిని పూర్తి చేయాలని కోరారు. అమృత్ పథకం ద్వారా తాగునీళ్లు ఇవ్వడంతో పాటు టిడ్కో ఇళ్ల కనీసం 10శాతం కూడా పూర్తి చేయకుండా పాడు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగిపోయిన పథకాలకు మోక్షం కల్పించాలని కోరారు. ఈ ప్రశ్నకు స్పందించిన మంత్రి నారాయణ మాట్లాడుతూ త్వరలో టిడ్కో ఇళ్లతో పాటు తాగునీటి పథకాన్ని రానున్న మూడేళ్లలో పూరిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

అనాథ వృద్ధుడిని చేరదీసిన శ్రీకరుణ ఆశ్రమం

నరసరావుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం శివారు లింగంగుంట్ల కాలనీ సమీపంలోని రామాలయం సమీపంలో గత కొద్దిరోజులుగా ఒక వృద్ధుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితిలో కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న నారాయణస్వామి ఆ వృద్ధుని పరిస్థితి చూసి ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర వీరాయపాలెం లోని శ్రీకరుణ ఆశ్రమం వారికి బుధవారం సమాచారం అందించారు. ఆశ్రమం డైరెక్టర్ కాశయ్య స్పందించి నరసరావుపేట వచ్చి ముసలి వ్యక్తిని శుభ్రంచేసి వివరాలు అడిగితెలుసుకున్నారు. తన పేరు వెంకయ్య అని, ఊరు అప్పాపురం అని, తనకు ఎవరూ లేరని తెలిపాడు. దీంతో అతనిని ఆశ్రమానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకరుణ ఆశ్రమం డైరెక్టర్ కాశయ్య మాట్లాడుతూ అనాథలకు సేవలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.



అనాథ వృద్ధుడిని ఆశ్రమానికి తీసుకు వెళుతున్న డైరెక్టర్ కాశయ్య, పక్కన నారాయణ స్వామి

మహిళా దినోత్సవం స్ఫూర్తికి తూట్లు

● ఏపీ మహిళా సమాఖ్య నేత దుర్గాభవాని

చిలకలూరిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవం స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సమాఖ్య ఏరియా సమితి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె పాలకుల మాటల్లోనే మహిళా సాధికారత ఉందని, చేతల్లో లేదని విమర్శించారు. శ్రామిక మహిళల పోరాట స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కురిపించిన హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి టి.బాబురావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయానికి భిన్నంగా

మునిసిపాలిటీల్లో గ్రామాల విలీనం తగదు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో గ్రామాల విలీనం, రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగ దుస్థితిని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. మునిసిపాలిటీల్లో గ్రామాల విలీనానికి సంబంధించిన జీవోపై రాష్ట్రంలో పలుచోట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని, గత ప్రభుత్వం అనాలోచితంగా, స్థానికుల అభిప్రాయాలకు, నిబంధనలకు విరుద్ధంగా విలీన ప్రక్రియ చేపట్టిందన్నారు. చిలకలూరిపేట మునిసిపాలిటీలో కొన్ని గ్రామాలను నిబంధనలకు విరుద్ధంగా విలీనం చేశారని చెప్పారు. పసుమర్రు, మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామాల విలీనాన్ని ఏకపక్షంగా తిరస్కరించారని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాటన్ అనుబంధ పరిశ్రమలకు పవర్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు పవర్ సబ్సిడీలు ఇస్తున్నాయని తెలిపారు. రెండు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను బతికించకపోతే ప్రభుత్వం నష్టపోతుందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న టెక్స్‌టైల్ రంగాన్ని ఆదుకోవాలని కోరారు. బయోమైనింగ్ పేరుతో చెత్త సేకరణ టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా డబ్బులు డ్రా చేసుకుని ప్రభుత్వాన్ని మోసగించిన జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆయన కోరారు. దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమృత్ పథకం తొలిదశలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల్ని అమృత్-2లో పూర్తిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. వచ్చే ఏప్రిల్ నుంచి బిల్లుల చెల్లింపును నేరుగా మునిసిపాలిటీలే చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. ఈ నిర్ణయం వల్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని అన్నారు.

తిరునాళ్ళలో ఏరులై పారిన మద్యం

ఈపూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈపూరు బోటుమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళలో మద్యం ఏరులై పారింది. రాత్రి 10గంటలకు మూసివేయాల్సిన మద్యం షాపులు అర్ధరాత్రి 1.30 గంటల వరకు తెరిచి ఉంచారు. ఇటీవల ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మద్యం దుకాణం, గతంలో ఏర్పాటు చేసిన దుకాణం రెండు గుడికి వెళ్ళే దారిలోనే ఉండడంతో భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. వినుకొండ-హైదరాబాద్ ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటుచేసిన మద్యం దుకాణం వలన తిరునాళ్ళకు వెళ్ళే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీటిపై చర్యలు తీసుకోవటంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ విషయమై ఈపూరు సీఐ డీ వెంకటేశ్వర్లు వివరణ కోరగా నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

తైక్వాండోలో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి బంగారు పతకం

నరసరావుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా తైక్వాండో సీనియర్ మహిళా సిటీ లీగ్ పోటీలలో 49కిలోల లోపు విభాగంలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి వీ తులసి తన్మయ్ బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ బుధవారం తెలిపారు. ఈ నెల 8,9 తేదీలలో తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించిందన్నారు.

గృహ నిర్మాణాలకు నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి

● హౌసింగ్ డీఈఈ శ్రీనివాసరావు

శావల్యాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గ్రామాల్లో గృహ నిర్మాణాలు చేసుకోదలచిన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోపు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రస్తుతం 3979మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటిలో శావల్యాపురం మండలం నుంచి 721 దరఖాస్తులు వచ్చాయన్నారు. పీఎంఏవై పథకం ద్వారా ఒక్కో గృహనిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలను లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ అల్లాభక్షు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

● బొల్లాకు వ్యతిరేకంగా ఏకమైన అసమ్మతి నేతలు

వినుకొండ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లాతో పాటు బొల్లా అసమ్మతి నేతలు పోటాపోటీగా వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. అదేవిధంగా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సొంత పార్టీలో అవమానాలను ఎదుర్కొన్న నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ముఖ్యనాయకులంతా ఏకమై చెక్‌పోస్టు సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు వర్గాల నేతలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

మోడల్ స్కూల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు

ఆంధ్రజ్యోతికి స్పందన

ఈపూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిర్మాణం మధ్యలో నిలిచిన ఈపూరు ఏపీ మోడల్ స్కూల్ భవనాల నిర్మాణం కోసం మనబడి మన భవిష్యత్ కింద రూ.23 లక్షలు జిల్లా కలెక్టర్ మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి బుధవారం తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థుల అవస్థలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

వైసీపీది విద్యార్థులపై దండయాత్ర

● గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేసింది యువత పోరు కాదని, విద్యార్థులపై దండయాత్ర అని తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలన వల్లే రూ.4720 కోట్లు ఫీజు బకాయిలు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులపై కక్షతోనే వైసీపీ పాలనలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ నీరుగార్చారన్నారు. వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిన వైసీపీ నాయకులకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. జీవో 77 తీసుకొచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇప్పుడు అదే జీవో రద్దు చేయాలనడం దారుణం అన్నారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగంటి భార్గవ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లలపై దృష్టి పెట్టాలి: ఎంఈవో

శావల్యాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంపాటు పాఠశాలలకు హాజరవ్వని విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. శావల్యాపురం ప్రాథమిక పాఠశాల, మతుకుమల్లి జడ్పీ పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ సమావేశాలను బుధవారం నిర్వహించారు. ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారిలు ఉపాధ్యాయులకు పలు విషయాలపై సూచనలు చేశారు.

పాలిథిన్ కవర్ల నిషేధానికి సహకరించాలి: కమిషనర్

చిలకలూరిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చిలకలూరిపేటలో భాగంగా నూరుశాతం పాలిథిన్ కవర్ల నిషేధానికి ప్రజలు, వ్యాపార వర్గాల వారు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు బుధవారం కోరారు. ఈ నెలలో ప్లాస్టిక్ రహిత చిలకలూరిపేటగా మార్చటానికి సింగిల్ యూజ్ పాలిథిన్ కవర్లను నిషేధిస్తున్నట్లు వెల్లడించారు.

గడ్డి వాములు దగ్ధం

బొల్లాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరుకు చెందిన ఆవుల రామిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైంది. గడ్డి వామి వద్ద అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడటంతో వినుకొండ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.1.50 లక్షలు విలువైన గడ్డి దగ్ధమైంది.

క్లుప్తంగా...

● నరసరావుపేట లీగల్, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంధత్వ నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో పేషంట్లకు అంధత్వ నివారణపై అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంధత్వం నివారణ అధికారి డాక్టర్ భువనేశ్వరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, ఆర్ఎంవో డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సురేష్, డాక్టర్ హేమశ్రీ, డాక్టర్ అరుణకుమారి పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: ఇటీవల ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ పదార్థాల వినియోగం నిషేధంపై పట్టణంలోని మునిసిపల్ బాయ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు బహుమతి ప్రదానం చేశారు.

● వినుకొండ: ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ ఆవరణలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమయ్య, ఎస్కే సైదా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పల్నాడు జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ అధికారి బుధవారం కోరారు. దీనికి సంబంధించి రుణాలను ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, టీజీలకు లక్ష రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం రైతు సేవా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు సర్ఫ్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖలతో మండల స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే. అమలుకుమారి ఉత్తమ రైతులకు సన్మానం చేశారు. పల్నాడు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల విజయ గాథ పుస్తకాలను టీడీపీ మండల కన్వీనర్ పెద్దిరాజు, మాజీ ఎంపీపీ నారా బాబురావు, ఆవిష్కరించారు.

● ఈపూరు: ఈపూరు ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి బుధవారం కోరారు. ఇతర వివరాల కోసం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

● ఈపూరు: మండలంలో జరుగుతున్న పీ 4 సర్వే త్వరతగతిన పూర్తి చేయాలని పంచాయితీరాజ్ విస్తరణాధికారి నాగెండ్ల రత్నం ఆదేశించారు. బొమ్మరాజుపల్లిలో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు.

● శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్, యేసు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరంలోని జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను డీఆర్‌వో మురళి బుధవారం పరిశీలించారు. ధనలక్ష్మి సంస్థల వారు ఈ బస్ షెల్టర్‌ను గతంలో నిర్మించారు. కాగా గ్రామస్థుల కోరిక మేరకు బస్ షెల్టర్‌ను సచివాలయంగా మార్చే ప్రతిపాదనపై ఆయన పరిశీలించారు.

●నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ సిద్దలింగమూర్తి పరిశీలించారు. బుక్కాపురం, సంక్రాంతిపాడు, నాదెండ్ల గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె వసూలు

చిలకలూరిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలోని జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ షాపు రూముల అద్దె వసూళ్ల కోసం జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 13షాపు రూముల అద్దె బకాయి రూ.3,15,000 ఉండగా ఒక్కరోజు స్పెషల్ డ్రైవ్‌లో రూ.2,15,000 వసూలు చేశారు.

● నాదెండ్ల: వేసవి ప్రారంభ మవుతున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో స్వరూపరాణి, తహసీల్దార్ ఏపీ రమణ, అధికారులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని, ప్రధానంగా వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, తహసీల్దార్ విజయశ్రీ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● యడ్లపాడు: పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కంచర్ల కాంతారావు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని జగ్గాపురం పశు వైద్యశాల పరిధిలోని జాలాదిలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యడ్లపాడు ఏరియా వైద్యశాల ఏడీ డాక్టర్ రాధాకృష్ణతో కలసి టీకాలు వేసే కార్యక్రమాన్ని డాక్టర్ కాంతారావు పరిశీలించారు. కార్యక్రమంలో తిమ్మాపురం పశువైద్యాధికారి డాక్టర్ కలిషా బేగం, జగ్గాపురం, తిమ్మాపురం పశు వైద్యశాలల సిబ్బంది పాల్గొన్నారు.

